రేషనలైజేషన్ పక్రియ వెంటనే ప్రారంభించాలి

మాట్లాడుతున్న ఎన్సీ, ఎన్టీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న

జన్నారం, జూన్ 1 : తొమ్మిదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రేషనలైజేషన్ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని ఎన్సీ, ఎన్టీ రాష్ట్ర ఫెడరేషన్ అధ్యక్షుడు జాడి రాజన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టక పోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి అస్తవ్యస్తంగా మారిందన్నారు. విద్యార్థులు పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు బదిలీ చేయాలన్నారు. బదిలీలు, ఉద్యోగోన్నతుల ప్రక్రియను వేసవి సెలవులు ముగిసేలోగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాంటెంకి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గోపాల్ ఉన్నారు.

'న్యాయం చేయండి.. లేదంటే ఆత్మహత్య చేసుకుంటా'

చెన్నూర్ టౌన్, జూన్ 1 : 'నా భూమిని ఆక్రమించుకొని బండారు చిన్నన్న స్తంభాలు వేసుకున్నాడని, నాకు న్యాయం చేయలేదంటే మంచిర్యాల జిల్లా చెన్నూర్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్యకు చేసుకుంటాను' అని బాధితుడు దుగ్గెపల్లికి చెందిన దేవయ్య మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..గతంలో తన చెన్నూర్‌లోని భూమిని బండారు చిన్నన్నకు విక్రయించానని తెలిపాడు. తాను కొంతమేరకే అమ్మానని, మిగతా భూమి తనకు అప్పగించాలని అడుగగా ఇవ్వడం లేదని ఆరోపించాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నది. ఇటీవల చిన్నన్న సిమెంట్ స్తంభాలు వేసుకోగా, దేవయ్య సదరు భూమి వద్దకు వెళ్లి ఆందోళనకు దిగాడు. ఈ విషయంపై పోలీసులు ఫిర్యాదు తీసుకోవడం లేదని, చెన్నూర్ సీఐ కూడా చిన్నన్నకే అనుకూలంగా మాట్లాడుతున్నాడని ఆరోపించాడు. తనను పదేపదే ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చిన్నన్న కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయంలో చెన్నూర్ సీఐ రవీందర్ వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

మందమర్రి, జూన్ 1 : మందమర్రి పట్టణంలోని విత్తన దుకాణాలను వ్యవసాయ శాఖ, పోలీసు అధికారులు శనివారం తనిఖీ చేశారు. పాతబస్టాండ్ ఏరియాలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంతో పాటు, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్‌లో మండల వ్యవసాయ శాఖ అధికారి దాసరి రాజేశం, ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ మల్లేశం, ఏఈవో ముత్యం తిరుపతి.. స్టాక్ వివరాలు, విత్తన నిల్వలను పరీక్షించారు. ఎవరైనా లూజు, కాలం చెల్లిన విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జైపూర్, జూన్ 1 : మండలంలోని ఆయా గ్రామాల్లోని విత్తన దుకాణాలను వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు తనిఖీ చేశారు. వ్యవసాయాధికారి మార్క్‌గ్లాడ్‌సన్, ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

సిర్పూర్(టీ), జూన్ 1 : సిర్పూర్(టీ)లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో సిర్పూర్(టీ) మండల ప్రత్యేక స్క్వాడ్ బృందం సభ్యులు ఏవో మధులత, ఎస్ఐ దీకోండ రమేశ్, ఆర్ఐ ముబీన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

వాంకిడి, జూన్ 1 : మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఏవో మిలింద్ కుమార్ తనిఖీ చేశారు. రికార్డులు, విత్తనాలు, ఎరువుల నిల్వలను పరిశీలించారు.

ఘనంగా హనుమాన్ జయంతి



చెన్నూర్ రూరల్ : ఓత్కులపల్లిలో వేడుకల్లో మాజీ జడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్ రావు

తాండూర్/మంచిర్యాలటౌన్/చెన్నూర్ టౌన్/చెన్నూర్ రూరల్/కన్నెపల్లి/భీమారం/రెబ్బెన, జూన్ 1 : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో శనివారం హనుమాన్ జయంతి ఉత్సవాలను భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయాలు, హనుమాన్ ఆలయాల్లో వేదపండితులు, అర్చకులు మంత్రోచ్ఛరణల నడుమ పంచామృత, నమక చమక దశవిధ శాంతి మంత్రాలతో స్వామివారికి అభిషేకం, షోడశోపచార పూజ, తమలపాకు అర్చన, అష్టోత్తరం, పత్ర పూజలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌లోని శ్రీ కోదండ రామాలయం, బోయపల్లి హనుమాన్ ఆలయం, మండలంలోని పలు ఆలయాల్లో వేదపండితులు, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. దీక్షాపరులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు. మంచిర్యాలలోని ఐబీ చౌరస్తాలో గల హనుమార్ విగ్రహం ముందు వీర హనుమాన్ సేన సభ్యులు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. ఆ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బింగి ప్రవీణ్, సభ్యులు పెనిమల్ల ఈశ్వర్, చేరాల వంశీ, నాగవెల్లి వినోద్, సుమన్, అర్కాల రాజు, ముద్దసాని గణేశ్, మహేందర్, శ్రవణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు. చెన్నూర్ పట్టణంలోని చోటా, బడా, పంచముఖ, పుప్పాల, రౌండ్ హనుమాన్ ఆలయాల్లో దీక్షాపరులు, భక్తులు పూజలు నిర్వహించారు. మండలంలోని ఓత్కులపల్లి, ఆస్నాద్, కొమ్మెర, కిష్టంపేట, నాగాపూర్, ముత్తరుపల్లి, పొక్కూర్ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓత్కులపల్లి ఆలయంలో నిర్వహించిన పూజల్లో మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్ పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ మాడ సుమలత మాదవ రెడ్డి, కిష్టంపేట మాజీ సర్పంచ్ బుర్ర రాకేశ్ గౌడ్, ముత్తరాపల్లిలో నాయకులు అయిత సురేశ్ రెడ్డి దంపతులు, నాగపూర్‌లో అన్నల తిరుపతి దంపతులు, బండారి సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. కన్నెపల్లి మండలంలోని వీరాపూర్, జన్కాపూర్, కన్నెపల్లి, రెబ్బెన, జజ్జరవెల్లి, మాడవెల్లి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. భీమారం మండల కేంద్రంలోని శ్రీ అభయంజనేయ స్వామి 12 వార్షికోత్సం నిర్వాహకులు చెఱుకు భారతి-సరోత్తమరెడ్డి ఘనంగా నిర్వహించారు. నాయకులు పోడెటి రవి, బీసీ స్టేట్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ తంగళ్లపల్లి అరుణ్‌కుమార్, జనంపల్లి సమ్మయ్య, ఎంపీడీవో రాధా రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. కోటపల్లి మండలంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని సుందరంగా అలకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మందమర్రి మందమర్రి పట్టణం పాలచెట్టు ఏరియాలోని శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం చేసి, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పంచకుండాత్మక హనుమత్ కవచ హోమం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, ఆలయ పూజారులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, కృష్ణకాంతాచార్యులు, నరసింహాచార్యులు, శ్రీకాంతాచార్యుల మంత్రోత్చారణలతో హోమం నిర్వహించారు. అలాగే మూడో జోన్‌లోని రామాలయంలో, పట్టణంలోని మారుతినగర్, యాపల్ ఏరియాలలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లును చేశారు. రెబ్బెన మండలం గోలేటి శ్రీ కోదండ రామాలయంలో ఉదయం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, దండకం పఠనం, పూజలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా 'బడిబాట' నిర్వహించాలి

తాండూర్ : కిష్టంపేటలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

తాండూర్, జూన్ 1 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో పీ శ్రీనివాస్ ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఐసీడీఎస్, ఐకేపీ, ప్రభుత్వ ఉపాధ్యాయులతో బడిబాట సమన్వయ సమావేశాలు నిర్వహించారు. కిష్టంపెట్ పంచాయతీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని ఆవాస ప్రాంతాల్లో 'బడి బాట' నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మమత, స్వరూపారాణి, ఉపాధ్యాయులు, కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి, జూన్ 1 : కోటపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులు, గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులతో ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మయ్య సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో అక్తర్ మోహియొద్దీన్, ఎంఈవో తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

మందమర్రి రూరల్, జూన్ 1 : మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో జాడి పోచయ్యతో కలిసి ఎంపీడీవో రాజేశ్వర్.. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీవో భీరయ్య, ఎస్ఐ రాజశేఖర్, ఏపీఎం లలిత కుమారి, మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు దత్తుమూర్తి, పద్మజ, నీసీ చారి తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ పకడ్బందీగా నిర్వహించాలి

ఎన్నికల కౌంటింగ్ పరిశీలకురాలు విజయ ఈ రవి కుమార్ ఎస్‌సీఎస్

హాజీపూర్, జూన్ 1 : లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల కౌంటింగ్ పరిశీలకురాలు విజయ ఈ రవికుమార్ ఎస్‌సీఎస్ అధికారులకు సూచించారు. హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, డీసీపీ అశోక్‌కుమార్, మంచిర్యాల ఆర్డీవో డీ చంద్రకళ, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్లకు ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. విధులు కేటాయించబడిన అధికారులు బాధ్యాయుతంగా వ్యవహరించాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి పని చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ఎస్పీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, తహసీలాదర్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం అధికారులు, పోలీసులు, సంబంధిత అధికారులున్నారు.

నస్పూర్, జూన్ 1 : పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ (జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ల) కార్యక్రమానికి పరిశీలకురాలిగా నియమితులైన విజయ ఈ రవికుమార్ ఎస్‌సీఎస్ జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా శనివారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్, డీసీపీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్ రాహుల్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

యూనిఫాంలు సకాలంలో అందించాలి

లింగాపూర్, జూన్ 1: విద్యార్థులకు యూనిఫాంలను సకాలంలో అందజేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ వెలుగు ఏపీఎం సదానందానికి సూచించారు. మండల కేంద్రంలోని కుట్టుమిషన్ కేంద్రంలో శనివారం దుస్తులను పరిశీలించారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి సమస్యలను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. గోపాల్‌పూర్, నాగుగూడ, జాముల్‌ధార, లింగాపూర్, మోడీగూడ, చిన్నదాంపూర్ గ్రామాల్లోని పాఠశాలల్లో మరమ్మతులను వారంలోగా పూర్తి చేయించాలని ఎంఈవో సుధాకర్ కు సూచించారు. ఆయన వెంట జిల్లా విద్యాధికారి అశోక్, ఎంఈవో సుధాకర్, ఐటీడీఏ ఏఈ ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బెజ్జూర్, జూన్ 1 : బెజ్జూర్ జడ్పీ సెకండరీ పాఠశాల 2004-05 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు సాధనిక ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సుదర్శన్, ఆంజనేయులు, సదానందం, శ్రీనివాస్, నారాయణ సింగ్‌ను విద్యార్థులు సన్మానించారు.

సర్వేను అడ్డుకున్న గ్రామస్తులు

కాగజ్‌నగర్, జూన్ 1 : మండలంలోని అంకూసాపూర్ శివారులో శనివారం నిర్వహించిన పోడు భూముల సర్వేను రైతులు అడ్డుకున్నారు. కొద్ది రోజులుగా వివాదాస్పదంగా మారుతున్న పోడు భూమిపై అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు శనివారం సర్వే కోసం వెళ్లారు. 30 ఏళ్ల నుంచి పోడు వ్యవసాయం చేస్తూ బతుకుతున్నామని, సర్వే చేయొద్దని అధికారులను అంకూసాపూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనుదిరిగి వెళ్లారు. ఈ విషయమై ఎఫ్ఆర్వో రమాదేవిని ఫోన్‌లో సంప్రదించగా ఆమె అందుబాటులోకి రాలేదు.

జాతీయస్థాయిలో రాణించాలి

తాండూర్, జూన్ 1 : వాలీబాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో నేర్చుకున్న మెళకువలతో రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించాలని క్రీడాకారులకు తాండూర్ సీఐ కే కుమారస్వామి సూచించారు. తాండూర్ సర్కిల్ పోలీస్ పరిధిలోని అంకుశం గ్రామంలో శనివారం వాలీబాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రాజమోగిలి, ఉపసర్పంచ్ కొప్పుల భానుచందర్, సీనియర్ క్రీడాకారులు సంకురి శంకర్, నారాయణ, హనుమంతు, భూమన్నగౌడ్, శ్రీనివాస్, రమేశ్, ముద్దం శివ, కోచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాశీలో ఇద్దరి మృతి

చెన్నూర్ టౌన్, జూన్ 1 : దైవ దర్శనం కోసం కాశీకి వెళ్లిన ఇద్దరు చెన్నూర్‌వాసులు వేర్వేరు సంఘటనల్లో అక్కడే హఠాన్మరణం చెందడం పట్టణంలో విషాదం నింపింది. స్థానిక ఆదర్శనగర్ కాలనీకి చెందిన గొడిశెల గౌరారెడ్డి (58) తన తండ్రి అస్థికలను కాశీలోని గంగలో కలిపేందుకు వెళ్లి, గుండెపోటుతో మృతి చెందాడు. విదేశాల్లో ఉంటున్న గౌరారెడ్డి కుమారులు కాశీకి వచ్చి అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనానికి వెళ్లిన కలకోట కనక మహాలక్ష్మి (70) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. మహాలక్ష్మి కొడుకు బాలకృష్ణ చెన్నూర్ మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కూతురు హైదరాబాద్‌లో ఉంటున్నది.

ఉచిత కంటి వైద్య శిబిరం

దండేపల్లి, జూన్ 1 : దండేపల్లి మండల కేంద్రంలో ఎర్ర బెల్లి రఘునాథ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కంటి ఆపరేషన్ ఉన్నవారిని రెఫర్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా హరినాయక్, బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు గోపతి రాజయ్య, బందెల రవిగౌడ్ నాయకులు ఎంబడి సురేందర్, పిట్టల అశోక్, అక్కల దివ్య, ప్రభాకర్, బెడద సురేశ్, నర్సింగ్ నాయక్, రాకేశ్, సత్యం, సంతోష్, చిట్ల శ్రీనివాస్, మల్లేశ్, తులసి, రవీందర్, గంగాధర్, దిలీప్, ప్రవీణ్, లక్ష్మణ్, సంతోష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

దండేపల్లి, జూన్ 1 : గ్రామ పంచాయతీ స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరుతూ నంబాల గ్రామస్తులు శనివారం తహసీల్దార్ సంధ్యారాణికి ఫిర్యాదు చేశారు. నంబాల జీపీ కార్యాలయానికి ఆనుకొని ఉన్న భూమిలో పక్కన ఉన్న వ్యక్తి ప్రహరీ నిర్మిస్తున్నాడన్నారు. గతంలో సర్వేయర్ చేత కొలతలు నిర్వహించినప్పటికీ మళ్లీ స్థల ఆక్రమణకు ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. అధికారులు స్పందించి జీపీ స్థలం ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు.

ధాన్యం తరలింపు పరిశీలన

తాండూర్, జూన్ 1 : మండలంలోని తాండూర్, రేచిని, ఆచ్చలాపూర్‌లోని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల ద్వారా రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియను శనివారం తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పరిశీలించారు. 136 మంది రైతుల నుంచి 8,410క్వింటాళ్ల 80 కిలోలు ధాన్యం కొనుగోలు చేసి, మిల్లులకు రవాణా చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తయినందున ఆదివారం నుంచి కొనుగోళ్లను నిలిపివేస్తునట్లు తెలిపారు.

వడ దెబ్బ తో ఒకరి మృతి

భీమారం, జూన్ 1 : భీమారం మండల కేంద్రంలో అరుకల సంపత్ (45) వడదెబ్బతో శనివారం మృతి చెందాడు. భీమారం ఎస్ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం..శ్రీరాంపూర్ పట్టణానికి చెందిన సంపత్ భీమారంలోని స్నేహితుడి వద్దకు వచ్చాడు. తిరిగి వెళ్తుండగా, వడదెబ్బతో అస్వస్థతకు గురై మృతి చెందాడు. సంపత్ చెన్నూర్ పట్టణంలోని ఓ వైన్స్ పర్మిట్ రూంలో వర్కర్‌గా పనిచేస్తున్నాడని ఎస్ఐ తెలిపారు.

చుక్కల దుప్పి మృతి

కాగజ్‌నగర్, జూన్ 1 : కాగజ్‌నగర్ మండలం అనుకోడ అటవీ ప్రాంతంలో శనివారం వేట కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందినట్లు ఎఫ్ఆర్వో రమాదేవి తెలిపారు. అటవీ శాఖ అధికారులు, పశు వైద్యాధికారి దుప్పి కళేబరాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. అనంతరం ఖననం చేశారు.

టేకు చెట్టు నరికివేత

జన్నారం, జూన్ 1 : జన్నారం రేంజ్ పైడిపెల్లి బీట్‌లోని ప్రధాన రహదారి పక్కన గల అడవిలో కలప స్మగ్లర్లు టేకు చెట్టును నరికివేశారు. అది విద్యుత్ లైన్‌పై పడడంతో అక్కడి నుంచి పారిపోయారు. ప్రధాన రహదారికి 100 మీటర్ల దూరంలోనే ఉండడం, రాత్రి 10 గంటల ప్రాంతంలో ఎలాంటి భయం లేకుండా స్మగ్లర్లు చెట్టును నరకడంతో అటవీశాఖ అధికారులపై ప్రజలు పలు రకాలుగా మాట్లాడం చర్చనీయాంశమైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, అడవులను రక్షించాలని కోరుతున్నారు.

భార్యను గొడ్డలితో హతమార్చిన భర్త

కాసిపేట, జూన్ 1 : క్షణికావేశంలో భార్యను భర్త గొడ్డలితో కొట్టి హత్య చేసిన సంఘటన మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని మామిడిగూడెంలో జరిగింది. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మామిడిగూడేనికి చెందిన నగావత్ దేలు తన భార్య నగావత్ మరోని(58)తో తిండి పెట్టడం లేదని, తాగడానికి డబ్బులు ఇవ్వడం లేదని, పట్టించుకోవడం లేదని గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో క్షణికావేశంలో గొడ్డలితో దేలు తన భార్య నగావత్ మరోని తలపై విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. దేలును అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

జెండా గద్దె నిర్మాణానికి యత్నం

- అడ్డుకున్న అటవీ శాఖ అధికారులు

జైపూర్, జూన్ 1 : జైపూర్ మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల అటవీశాఖ భూమిలో శనివారం కాంగ్రెస్ నాయకులు జెండా గద్దె ఏర్పాటుకు యత్నించారు. విషయం తెలుసుకున్న స్థానిక అటవీ రేంజ్ అధికారి సాగరిక సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర అవిర్భావ దినోత్సం సందర్భంగా శనివారం నాయకులు గద్దె నిర్మిస్తుండగా, స్థానికుల సమాచారంతో అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. సుమారు 50 యేండ్ల క్రితం ఇక్కడ అటవీ రేంజ్ కార్యాలయం ఉండగా, ఇక్కడ నుంచి శాఖాపరమైన కార్యకలాపాలు కొనసాగించారు. కాలక్రమేణ అది మొత్తం కూలిపోగా, నేడు అత్యంత ఖరీదైన స్థలంగా ఉండిపోయింది.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మందమర్రి, జూన్ 1 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మందమర్రి పట్టణంలో అమరవీరుల జ్యోతి, కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. స్థానిక శాంతినగర్‌లోని శివాని ఉన్నత పాఠశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ, విద్యానగర్ మీదుగా పాతబస్టాండ్ సెంటర్‌లోని అమర వీరుల స్తూపం వరకు సాగింది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యూత్, విద్యార్థి నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

5 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

వెల్లడించిన సీపీ శ్రీనివాస్

నెన్నెల, జూన్ 1 : నెన్నెల మండలం బొప్పారంలో శనివారం 5 క్వింటాళ్ల ప్రభుత్వ నిషేధిత (బీటీ-3) నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు రామగుండంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు రామగుండం టాస్క్ ఫోర్స్ సీఐ సంజయ్, ఎస్ఐ లచ్చన్న స్థానిక పోలీసుల సాయంతో బొప్పారం గ్రామానికి చెందిన కర్నకొండ చంద్రశేఖర్ ఇంట్లో తనిఖీ చేశారన్నారు. నిల్వ ఉంచిన నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కర్నకొండ చంద్రశేఖర్‌ను విచారించగా, మందమర్రికి చెందిన రజాక్, బైంసా, జాని నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడని వివరించారు. ఈ విత్తనాలను సొల్లు పెద్దయ్య, సురేశ్ అక్రమంగా రవాణా చేసి, చంద్రశేఖర్ ఇంటికి తీసుకవచ్చినట్లు తెలిపారు. ఇక్కడి నుంచి రైతులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. సూరం దిలీప్, కల్లూరి వెంకటేశంకు కూడా భాగం ఉందని చంద్రశేఖర్ తెలిపినట్లు సీపీ శ్రీనివాస్ వివరించారు. వారందరిపైనా కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సీఐ అబ్జలొద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్(టీ), జూన్ 1 : సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టులో జూన్ 8న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ అజయ్ ఉల్లం అన్నారు. మండలకేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో సిర్పూర్(టీ) కోర్టు పరిధిలోని పోలీసు అధికారులతో శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటల సీఐ సాదిక్ పాషా, కాగజ్‌నగర్ సీఐ, సిర్పూర్(టీ) ఎస్ఐ దీకోండ రమేశ్, సిర్పూర్(టీ) కోర్టు పరిధిలోని పలు మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి

కాసిపేట, జూన్ 1 : గ్రామాలను శుభ్రంగా ఉంచాలని మంచిర్యాల డీపీవో వెంకటేశ్వర్‌రావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం కాసిపేట మండలంలోని దేవాపూర్, ముత్యంపల్లి, కాసిపేట గ్రామాల్లో పర్యటించారు. పారిశుధ్య పనులతో పాటు సెగ్రిగేషన్ షెడ్‌లు, పల్లె ప్రకృతి వనాలను, క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి డంప్ యార్డుకు తరలించాలన్నారు. చెత్తలో ప్లాస్టిక్ వస్తువులు, కంపోస్ట్ ఎరువును విక్రయించి ఆదాయం తేవాలని సూచించారు. ఆయన వెంట కొంక నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు మేఘన, సౌందర్య పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

మందమరి రూరల్, జూన్ 1 : ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు ప్రతినిధులకు విద్యార్థుల యూనిఫామ్స్‌ను ఎంపీడీవో రాజేశ్వర్, ఎంఈవో జాడి పోచయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా యూనిఫామ్స్